క్లుప్తంగా

సీఎం సభను విజయవంతం చేయాలి

అమలాపురం టౌన్: అమలాపురంలో ఈ నెల 26న జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు పట్టణంలోని 30 వార్డులకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆదివారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో సేవలందించాలని కోరారు.

డ్యూయల్ పోస్టులు అమలుచేయాలి



ఎంపీ అనురాధకు వినతిపత్రం ఇస్తున్న 2008 డీఎస్సీ అభ్యర్థులు

అల్లవరం: 2008 డీఎస్సీ నోటిఫికేషన్ జీఓ నెంబరు 161లో అంతర్భాగమైన జీఓ 112లో డ్యూయల్ పోస్టులను అమలుచేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 500 కుటుంబాలను ఆదుకోవాలని ఎంపీ అనురాధను ఏపీ స్టేట్ డ్యూయల్ పోస్టు బీఈడీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మొగళ్ళమూరులోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. ఈ నెల 26న అమలాపురం వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లు

యానాం: యానాం నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న వివిధ ట్రేడుల్లోని సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్‌కే సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంట్లో భాగంగా ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ ట్రేడులో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆసక్తి గల అభ్యర్థులు ఐటీఐ ఆఫీసుకు వచ్చి లేదా హెల్ప్ డెస్క్ 94914 41164, 08842 951001 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

దోమల నివారణ చర్యలు



బాలికల వసతి గృహంలో దోమల నివారణ చర్యలు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉప్పలగుప్తం పీహెచ్‌సీ సబ్‌యూనిట్ అధికారి వీఎస్‌వీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. వసతి గృహం లోపల, పరిసరాల్లో దోమల నివారణ మందు ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నాడ చిన్ని, ఏఎన్‌ఎం రాధ, ఆశా కార్యకర్త దేవరపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



బహుమతి అందుకుంటున్న మహాలక్ష్మి

యానాం: పుదుచ్చేరి రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో యానాం పట్టణ పరిధిలోని దరియాలతిప్ప గ్రామానికి చెందిన సబ్బతి మహాలక్ష్మి(మధు) విశేష ప్రతిభ కనబరిచాడు. ఆదివారం పుదుచ్చేరిలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో బ్యాక్ స్ట్రోక్ విభాగం 50, 100 మీటర్ల విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించాడని యానాం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మహాలక్ష్మిని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అభినందించారు.

మణిపూర్ ఘటనలపై కొవ్వొత్తుల ర్యాలీ



తాళ్లరేవులో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లరేవు: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఖండిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో శనివారం రాత్రి సీతారామపురం, ప్రతాప్ నగర్ నుంచి తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటనల్లో దోషులను కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, బళ్ల సంధ్యారాణి, ఐద్వా నాయకులు ఈశ్వరీబాయి తదితరులు పాల్గొన్నారు.

తలుపు తట్టి.. నాడి పట్టి..

- ఫ్యామిలీ డాక్టర్‌తో విస్తృత వైద్య సేవలు
- 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు



డి.రావులపాలెంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుమ

అల్లవరం: ఆరోగ్యమే మహా భాగ్యం అన్న సూక్తిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్షరాలా నిజం చేస్తుంది. నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేస్తుంది. ఇంటింటికీ నాణ్యమైన వైద్యాన్ని దరిచేర్చేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విధానంలో ప్రతి సచివాలయం పరిధిలో నెలకు రెండు పర్యాయాలు ప్రజల ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తున్నారు.



గతంలో ఎన్నడూ చూడని విధంగా వైద్యులే ఇంటికొచ్చి చికిత్స అందిస్తుండడంపై గ్రామీణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వరం

ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ఇద్దరు డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్త సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఓపీ సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్య కారణాలతో మంచాన పడిన రోగులు, బీపీ, షుగరు వ్యాధిగ్రస్తులతో పాటు గర్భిణులు, బాలింతల వద్దకు వెళ్లి చికిత్స చేస్తున్నారు. వీరికి నెలకి సరిపడా మందులను అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన రోగుల్ని నిత్యం పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి, 105 రకాల మందులను రోగులకు అందిస్తున్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకొచ్చాక గ్రామాల్లో వైద్య సేవలు విస్తృతమయ్యాయి. ప్రధానంగా పక్షవాతం, ఆర్థరైటిస్, గుండెజబ్బులు, క్యాన్సర్, ఆస్తమా లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరంగా మారింది.

14 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షలివీ

రక్త నిర్ధారణ పరీక్ష, గర్భ నిర్ధారణ పరీక్ష, మలేరియా, హెచ్ఐవీ, డెంగ్యూ, ఐయొడిన్ ఇన్ సాల్ట్, తాగునీరు శుద్ధత, హెపటైటీస్–బీ, గ్లూకోమీటర్, ఎఫ్ఎస్‌టీ, టీపీహెచ్ఏ కిట్, మల్టిపారా స్ట్రిప్, విజువల్ ఇన్‌స్పెక్షన్, స్పెటమ్ ఫర్ ఏఎఫ్‌బీ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు పొందుతున్న రోగుల వివరాలు

మండలం	పీహెచ్‌సీలు	వైద్య పరీక్షలు పొందుతున్న రోగులు (ఒక్క రోజుకి)
అల్లవరం	గోడిలంక, బెండమూర్లంక	140 మంది
అమలాపురం	పేరూరు, బండారులంక	150 మంది
ఉప్పలగుప్తం	ఉప్పలగుప్తం,భీమనపల్లి, ఎస్.యానాం	200 మంది
ఐ.పోలవరం	కేశనకుర్రు, జి.వేమవరం	200 మంది
ముమ్మిడివరం	కొత్తలంక	90 మంది
కాట్రేనికోన	కాట్రేనికోన, పల్లంకుర్రు	160 మంది

ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుంది



నా వయసు 62 సంవత్సరాలు. బీపీ, గ్యాస్ సమస్యలతో బాధపడుతున్నాను. గతంలో ప్రతి నెలా ప్రైవేటు ఆస్పత్రులకు వేలాది రూపాయిలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఫ్యామిలీ డాక్టర్లు ఇంటి వద్దకే రావడంతో డబ్బులు ఆదా అవుతున్నాయి. మాలాంటి వృద్ధులకు ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుంది.

– ఇసుకుపట్ల సూర్యకాంతం, డి.రావులపాలెం, అల్లవరం మండలం

ఆర్థిక భారం తగ్గింది



మా గ్రామ ప్రజలు వైద్యం కోసం అటు కాకినాడ గాని, ఇటు యానాం గాని వెళ్లాల్సి వచ్చేది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానం వరంగా మారింది. స్వయంగా ప్రభుత్వ వైద్యులే ఇంటికొచ్చి మరీ సేవలందించడమే కాకుండా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. దీనివల్ల పేదలకు ఆర్థిక భారం తగ్గింది. ప్రధానంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగం.

– కూరాటి వాసు, గోవలంక, తాళ్లరేవు మండలం

రాయితీపై మరో టన్ను టమాటాలు



అమలాపురం రైతుబజారులో రాయితీపై టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

అమలాపురం టౌన్: బహిరంగ మార్కెట్‌లో టామాటా ధర ఆకాశాన్నంటుతున్న సంగతి తెలిసిందే. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులకు రాయితీ నిస్తూ రైతు బజార్ల ద్వారా కిలో రూ.50కే టమాటాను విక్రయిస్తుంది. దీంట్లో భాగంగా అమలాపురం రైతు బజారు ద్వారా ఇప్పటికే 600 కిలోల టమాటాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచింది. తాజాగా ఆదివారం అమలాపురం రైతుబజారుకు మరో టన్ను టమాటాలు వచ్చాయి. దీంతో అధిక సంఖ్యలో వినియోగదారులు రాయితీ ధరతో టమాటాలను కొనుగోలు చేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి విశాలాక్షి ఆధ్వర్యంలో అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామకృష్ణ విక్రయాలను పర్యవేక్షించారు.

చూపు కోల్పోయిన బాలికకు సాయం



బాలిక నాగూరికి నగదు సాయాన్ని అందజేస్తున్న యువకులు

యానాం: మెదడు సంబంధిత వ్యాధి కారణంగా కంటి చూపును కోల్పోయిన ఐ.పోలవరం మండల పరిధిలోని భైరవపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన 20 ఏళ్ల బాలిక అంకాడి నాగూరికు స్థానిక సావిత్రినగర్ గ్రామ యువత అధ్యక్షుడు మల్లాడి రాజు చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక వైద్యానికి సాయపడటానికి అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువత సభ్యులు సంగాడి శ్రీనివాస్, బొమ్మిడి కామేశ్వరరావు, పాలెపు వీరబాబు, పాలెపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి వరద

అప్రమత్తంగా అధికారులు, వైద్య సిబ్బంది



అన్నంపల్లి అక్విడెక్టు వద్ద ఉరకలేస్తున్న గోదావరి



మురమళ్ల పుష్కర ఘాట్‌లోని శివారు పార్కులో చేరిన వరద నీరు

ఐ.పోలవరం: గోదావరి ఉధృతంగా ఉండడంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద నుంచి భారీగా వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాల్లో లంక పొలాలు గత రెండు రోజులుగా వరద ముంపునకు గురయ్యాయి. గోదావరిలో నీరు క్రమేపీ పెరుగుతుండటంతో తీర ప్రాంత ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో పశువుల్లంక, మురమళ్ల, కేశనకుర్రు, కొమరగిరి, ఎదుర్లంక, జి.మూలపొలం, గుత్తినదీవి గ్రామాల్లోని లంక గ్రామాల ప్రజలు, మత్స్యకారుల నివాస ప్రాంతాలు ముంపు బారిన పడుతున్నాయి. కాని ఎగువ ప్రాంతంలో వరద తగ్గితే ఇక్కడా వరద తగ్గుముఖం పడుతుందని రైతులు చెబుతున్నారు. వరద ముప్పును ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. నదీ పరివాహక ప్రాంతాల వద్ద రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే వరద ఉధృతి వల్ల మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద ఉన్న పుష్కర ఘాట్ మెట్ల పైకి వరద నీరు చేరుకుంది. వృద్ధ గౌతమీ గోదావరి పశువుల్లంక, ఎదుర్లంక, అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద గోదావరి ఉరకలేస్తూ పరవళ్లు తొక్కుతుంది.

ముమ్మిడివరం: గోదావరి ఎగువన వరద ఉధృతి నిలకడగా ఉన్నా కోనసీమలోని లంక గ్రామాలకు ముంపు బెడద తప్పడం లేదు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని గురజాపులంక, లంకాఫ్ ఠానేల్లంక, కూనాలంక, కమిని, చింతపల్లిలంక, చింతావానిరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతాల్లో వరద నీరు చేరుకుని ఉంది. ఐ.పోలవరం మండలం కొమరిగిరి పుగాకులంక, కనేల్లంక లంక గ్రామాల్లో వరద నీరు పోటెత్తింది. అధికారులు అప్రమత్తమై గ్రామగ్రామాన ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. పల్లపు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. మండల స్థాయి అధికారులు లంక గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

బియ్యం ఎగుమతులు నిలిపేయడం తప్పు



జిన్నూరి రామారావు

సాక్షి అమలాపురం: బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం విదేశాలకు బియ్యం ఎగుమతులు నిలిపేయడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదముందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు(బాబి) అన్నారు. అమలాపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరుగుతాయని కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. దేశంలో మూడేళ్లకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయని, విదేశాలకు ఎగుమతి చేయకుంటే రైతులు పండించే ధాన్యం కొనుగోలు మీద ఆ ప్రభావం ఉంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొంటామంటున్నా ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ(ఎఫ్ఏక్యూ) నిబంధనలకు అనుగుణంగా ఉన్న ధాన్యం కొంటోందని బాబి తెలిపారు. ఆ నిబంధనలకు అనుగుణంగా లేని ధాన్యం కొనుగోలు చేయకుంటే రైతుకు కనీస మద్దతు ధర రాదని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎమ్మెల్యే అశోక్‌కు రీజెన్సీ అధినేత పరామర్శ



ఎమ్మెల్యే అశోక్‌ను పరామర్శించిన రీజెన్సీ సంస్థల అధినేత నాయుడు

యానాం: ఎడమ కాలికి ఆపరేషన్ నిర్వహించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను ఆదివారం యానాం రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు పరామర్శించారు. గోపాల్‌నగర్‌లో నివాసముంటున్న ఎమ్మెల్యే స్వగృహానికి వచ్చి కాలికి సంబంధించి ఆపరేషన్, తదనంతర వైద్యం తదితర విషయాల గురించి ఆరా తీశారు. ఎమ్మెల్యే అశోక్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యేంద్రప్రసాద్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా యూడీసీ రాత పరీక్ష

1,869 మంది అభ్యర్థుల హాజరు



మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో తమ రోల్ నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న 116 అప్పర్ డివిజినల్ క్లర్క్(యూడీసీ) పోస్టుల భర్తీకి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది సెంటర్లలో పరీక్షను నిర్వహించారు. మొత్తం 2,122 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 1,869 మంది పరీక్షకు హాజరయ్యారని, 253 మంది గైర్హాజరయ్యారని రీజినల్ కోఆర్డినేటర్, ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. 240 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు జోనల్ ఆఫీసర్లు పరీక్షా కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీక్ష సజావుగా సాగేందుకు కృషి చేశారు. ఎస్పీ రఘునాయగం ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. పుదుచ్చేరి వ్యాప్తంగా యూడీసీ పరీక్షకు మొత్తం 46,000 మంది అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ఆ కుటుంబాలకు ఆత్మీయుడిగా వలంటీర్

వలంటీర్లకు వందనం



ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పిస్తున్న వలంటీర్ బాబా జాన్

అమలాపురం టౌన్: ఇతని పేరు అతర్ బాబాజాన్. అమలాపురం పట్టణం 22వ వార్డులో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తన సేవల ద్వారా తనకు కేటాయించిన 50 కుటుంబాల వారికి ఓ ఆత్మీయుడయ్యాడు. ప్రభుత్వ పథకాల గురించి ఎప్పటికప్పుడు వివరించడమే కాకుండా ఆయా పథకాల ద్వారా ఎప్పుడు వారి ఖాతాల్లో సొమ్ములు పడతాయో కొన్ని రోజుల ముందే ఇంటికి వచ్చి మరీ చెబుతాడు. ఆరోగ్య జాగ్రత్తలు చెబుతాడు. అందుకే ఆయా కుటుంబాల వారికి ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుగా గుర్తొచ్చేది వలంటీర్ జాన్..

మాకు చేదోడు వాదోడుగా ఉంటాడు



మా వలంటీర్ జాన్ మా కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటాడు. దివ్యాంగుడినైన నాకు ఆరోగ్య జాగ్రత్తలు చెబుతుంటాడు. ప్రభుత్వ పథకాల గురించి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తాడు. నాకు దివ్యాంగ పింఛన్, నా లాండ్రి దుకాణానికి వైఎస్సార్ చేయూత కింద డబ్బులు తీసుకుంటున్నానంటే అందుకు కారణం మా వలంటీరే. ఇచ్చేది జగనన్నే అయినా మా వరకూ చేర్చేది వలంటీరే కదా..

– పసుపులేటి సత్యనారాయణ, 22వ వార్డు, అమలాపురం

పింఛన్ అందిస్తూ.. భరోసానిస్తూ



సూర్యప్రకాశరావుకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ సరిత

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలో గత కొంత కాలంగా అనారోగ్యంతో మంచాన ఉన్న వృద్ధులు డేగల సూర్యప్రకాశరావుకి ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్‌ను వెలుగు రేఖలు రాకముందే అందించి వారి జీవితాలకు భరోసా కల్పిస్తున్న వలంటీర్ గంధం సరిత సేవలను అభినందించాల్సిందే.. ఒకటో తారీఖు వచ్చిందంటే చాలు మొదట అవ్వ, తాతలకే పింఛన్ అందిస్తూ, వారి ముఖాల్లో ఆనందం తీసుకొస్తుంది. వృద్ధులపై ప్రేమ, ఆప్యాయతను పంచుతుంది. అందుకే ప్రతి నెల క్రమం తప్పకుండా పింఛన్ అందిస్తూ భరోసా కల్పించడమే కాకుండా ఆమె అందిస్తున్న సహకారమే తనను బతికిస్తుందని పింఛన్ దారుడు డేగల సూర్యప్రకాశరావు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల నిరసన ప్రదర్శన



అమలాపురంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: మణిపూర్‌లో చెలరేగిన హింసలో ఇద్దరి మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఘటనలపై మాతా రమాబాయి అంబేడ్కర్ మహిళా సంఘం ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం సాయంత్రం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షురాలు పుణ్యమంతుల రజని మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన మానవ మృగాలను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు నీలం దుస్తులు ధరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

కరాటేలో 12 మంది విద్యార్థులకు బంగారు పతకాలు



కరాటేలో సాధించిన బంగారు పతకాలు, ధ్రువీకరణ పత్రాలతో అమలాపురం విద్యార్థులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం లేడీస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన జిల్లా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అమలాపురం విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారని చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. కటాస్, ఫైటింగ్ విభాగాల్లో బి.యశస్విని, ఎ.వినయ్, వై.నరసింహస్వామి, బి.మోహన్, కె.అక్షయ్ కుమార్, డి.బాలాదిత్య, కె.హర్షిత, ఎస్.షణ్ముఖ, కె.రామ్‌రెడ్డి, పి.సాయి ప్రణవ్, పి.శ్రీవరణ్, ఎం.సత్యదేవంత్‌కుమార్‌లు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను సాధించారన్నారు. విజేతలు ఆగస్టు 5, 6 తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలకు రిఫరీగా ఎ.రవి, టి.యశ్వంత్ వ్యవహరించారు.

విజేతలకు ప్రతిభా పురస్కారాలు



విజేతలతో ఏఆర్ డీఎస్పీ విజయసారథి తదితరులు

అమలాపురం టౌన్: వివిధ రంగాల్లో విజేతలుగా నిలిచిన నలుగురికి స్థానిక శ్రీరామానంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను ట్రస్ట్ ప్రతినిధులు ఆదివారం అందజేశారు. పట్టణంలోని గాంధీనగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ చైర్మన్ చిక్కం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ ప్రతిభా పురస్కార కార్యక్రమానికి ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చంద్రయాన్–3 అంతరిక్ష ప్రయోగంలో పాలు పంచుకున్న ఇస్రో శాస్త్రవేత్త నూకన విశ్వతేజ, ఐఐటీలో విజేతలైన పట్టణానికి చెందిన కాళ్లకూరి సాయినాథ్ శ్రీమంత్, గోకవరపు అంజనీ సుత ఆదిత్య, నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన జనిపిరెడ్డి శరవణసాయిలకు ట్రస్ట్ తరపున ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, వైఎస్సార్ సీపీ నేత వంటెద్దు వెంకన్నాయుడు, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు వంకాయల కాశీ తదితరులు పాల్గొన్నారు.

కన్నా ఆఖరిసారి చూడాలిరా నిన్ను

విదేశాల్లో చనిపోయిన కొడుకు కోసం తల్లి ఆవేదన



సంజీవరావు(ఫైల్)

ఉప్పలగుప్తం: నవమోసాలు మోసి అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు చనిపోతే ఆ తల్లి హృదయం ఎంతగా తల్లడిల్లుతుంది. విదేశాల్లో స్థిరపడతాడని ఆశిస్తున్న సమయంలో ఆ కుమారుడు ఇక లేడని తెలిస్తే ఎంత కలవరపాటుకి గురవుతుంది. విదేశంలో ఆత్మహత్య చేసుకున్న చల్లపల్లి పంచాయతీ పరిధి బొండాడిపేటకు చెందిన పాలమూరి సంజీవరావు(32) తల్లి పాలమూరి వరలక్ష్మి పరిస్థితి అదే. తన జీవిత చరమాంకంలోనైనా కుమారుడి కుటుంబం ఉన్నతంగా స్థిరపడాలని ఆశగా ఎదురుచూస్తున్న ఆ తల్లికి నిరాశే ఎదురైంది. వివరాల్లోకి వెళితే సంజీవరావు ఉపాధి నిమిత్తం బహ్రెయిన్‌లోని సల్మాన్ ప్రాంతానికి వెళ్లాడు. తనకు వీసా వచ్చిన చోట పని ముగియడంతో అక్కడే స్నేహితులతో కలిసి పనికి వెళుతున్నాడు. ఏమైందో తెలియదు కాని సంజీవరావు తాను నివసించేచోటే ఫ్యానుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, మృతదేహం ఆసుపత్రిలో ఉందని బంధువులు అతడి తల్లికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో కన్నా కడసారి చూడాలిరా నిన్ను అంటూ ఆ తల్లి బోరున విలపిస్తుంది. సంజీవరావు తండ్రి ప్రకాశరావు ఏడాది క్రితమే మృతి చెందారు. సంజీవరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వరలక్ష్మి ప్రజాప్రతినిధులు కలగజేసుకుని తన కుమారుడి మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చేందుకు సహకరించాలని దీనంగా వేడుకుంటుంది.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: చొల్లంగిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ఎస్సీ–15, ఎస్టీ–5, బీసీ–1, ఓసీ–1, బీసీ(సీ)–10 మొత్తం 30 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం సీఈసీలో 28, హెచ్ఈసీలో 30 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జిగా బొమ్మి సురేష్

ముమ్మిడివరం: ఆంధ్రప్రదేశ్ మాదిగ రాజకీయ పోరాట సమితి ఇన్‌చార్జిగా బొమ్మి సురేష్ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షుడు ఆకుమర్తి, రాష్ట్ర ఇన్‌చార్జి కంబాల ప్రదీప్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయని సురేష్ తెలిపారు. ఉద్యోగ, విద్య, రాజకీయ, ఆర్థిక, సంక్షేమ రంగాల్లో మాదిగలకు సమాన హక్కుల కోసం పోరాడతానని చెప్పారు.

తీర ప్రాంత జీవ జాతులను సంరక్షించాలి

అమలాపురం టౌన్: తీర ప్రాంతాల్లో అరుదైన జీవ జాతులను సంరక్షించుకోవాలని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ స్టాలిన్ పిలుపునిచ్చారు. అమలాపురంలోని ఎంప్లాయీస్ హోమ్‌లో జేవీవీ రాష్ట్ర శాఖ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పర్యావరణ సదస్సుకు స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సులో తొండంగికి చెందిన జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు కేవీకే మహేశ్వరరావు 'తీర ప్రాంత సంరక్షణ– అరుదైన జీవ జాతులు' అనే అంశంపై అవగాహన కల్పించారు. తీర ప్రాంత ధ్వంసం వల్ల కొన్ని జీవ జాతులు అంతరించిపోతున్నాయని సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డివిజనల్ ఇంజినీర్ కె.మృత్యుంజయరావు, జిల్లా జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర జేవీవీ పర్యావరణ కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవి కుమార్, జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లలిత కళలతోనూ సమాజ శ్రేయస్సు

అమలాపురం టౌన్: లలిత కళలతోనూ సమాజ శ్రేయస్సు సాకారమవుతుందని సంస్కార భారతి సంస్థ రాష్ట్ర క్షేత్ర ప్రముఖ్ వి.శేఖర్ అన్నారు. అమలాపురం రోటరీ క్లబ్ భవనంలో ఆదివారం జరిగిన రాష్ట్ర సంస్కార భారతి సర్వసభ్య సమావేశానికి శేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ఆయువుపట్టైన లలిత కళలను ప్రోత్సహిస్తూ, ప్రచారం చేస్తూ యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు సంస్కార భారతి పాటు పడుతోందన్నారు. సర్వ సభ్య సమావేశంలో కాట్రేనికోనకు చెందిన ఆకొండి అంజినిని సంస్కార భారతి రాష్ట్ర సహా సంయోజక్‌గా ప్రకటించారు. కార్యక్రమంలో సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణ, సంస్థ అఖిల భారత కార్యకారిణి సభ్యులు లక్ష్మీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్, కార్యదర్శి గోటేటి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.